క్లుప్తంగా

పారదర్శకతకు నిదర్శనం సీఎం జగన్ పాలన



కళావతికి నూతన పింఛన్ అందజేస్తున్న రంథి గోపీకృష్ణ

అల్లిపురం : పారదర్శక పాలనకు నిదర్శనం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అని 33వ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ అన్నారు. అవినీతి రహిత సమాజానికి నిదర్శనంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గౌరీవీధి సచివాలయం పరిధిలో వేంకటేశ్వరమెట్ట ప్రాంతానికి చెందిన కొత్తకోట కళావతికి వితంతు పింఛన్ మంజూరు కావటంతో ఆయన శనివారం సచివాలయ కార్యదర్శులు పీవీ కిరణ్‌కుమార్, జాన్‌బాబు, కన్వీనర్ లక్ష్మీకాంతం, వలంటీర్లు కావేరి, గొప్పలతో కలిసి లబ్ధిదారుకు పింఛన్ అందజేశారు.

శ్రీలక్ష్మీదేవి ఆలయం వద్ద మహాన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కొణతాల శ్రీనివాస్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీటాకీస్ సమీపాన గల శ్రీలక్ష్మీదేవి ఆలయం వద్ద శ్రావణ మాసం నాల్గో శుక్రవారాన్ని పురస్కరించుకుని మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పి. సన్యాసిరావు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ జిల్లా కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సోమేష్, పోలవరపు శ్రీనివాస్, అప్పలరాజు, అత్తిలి శ్రీనివాస్, దేవుడు, బీసీ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆలేటి హేమలత, సంఘం దక్షిణ నియోజకవర్గ అధ్యక్షుడు పిల్లా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షునిగా మళ్లీ రవీంద్రే



రవీంద్ర

సాక్షి, విశాఖపట్నం : భారతీయ జనతా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షునిగా మేడపాటి రవీంద్ర మరోసారి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు శుక్రవారం పలు జిల్లాల అధ్యక్షులను మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ జిల్లాకు సంబంధించి ప్రస్తుతం అధ్యక్షునిగా ఉన్న రవీంద్రనే కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు. కాగా రవీంద్ర 2019 డిసెంబర్ 31న మొదటిసారి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు మరోసారి ఆయనకు అవకాశం ఇవ్వడం పట్ల పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

అక్టోబర్‌లో ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కళాశాల (ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలను ఈ ఏడాది అక్టోబర్ 27,28,29 తేదీల్లో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. 27న ఆంధ్రా మెడికల్ కళాశాల (ఏఎంసీ) దినోత్సవం, 28న సెంటినరీ బ్లాక్ నిర్మాణానికి ప్రారంభోత్సవం, 29న అకడమిక్ సెషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కాగా ఏఎంసీలో వైద్య విద్య అభ్యసించి దేశ, విదేశాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు సెంటినరీ బ్లాక్ నిర్మాణానికి విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ బ్లాక్ ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్టు బ్లాక్ నిర్మాణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.రవిరాజ్ తెలిపారు.

ఏళ్ల నాటి కల.. తీరనున్న వేళ

- త్వరలో అందుబాటులోకి మత్స్యకార సామాజిక భవనం
- రూ. 17.7 లక్షలతో మరమ్మతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గంగపుత్రులు



శిథిలావస్థలో ఉన్న లక్ష్మీ టాకీస్ వద్ద గల మత్స్యకార సామాజిక భవనం

జగదాంబ : గతంలో పట్టించుకోకుండా వదిలేసిన భవనాలు ఇప్పుడు కొత్తరూపు సంతరించుకుంటూ ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్లక్ష్యానికి గురైన పాతనగరం అభివృద్ధిలో పరుగులు తీస్తోంది. జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ ప్రాంతంలో చాలా ఏళ్లుగా మత్స్యకార, వాడబలిజ సామాజిక భవనం మూలకు చేరుకుంది. ఆకతాయిలు మద్యం తాగడం, జూదం ఆడటం వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఆ భవనాన్ని వినియోగిస్తున్నారు. దీంతో స్థానికులు అటువైపు వెళ్లటానికి కూడా భయపడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఆకతాయిలు దాడులకు తెగబడుతున్నారు.

సరికొత్తగా మత్స్యకార సామాజిక భవనం..

వార్డులో సామాజిక భవనం కావాలని పలువురు మత్స్యకారులు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ మహ్మద్ సాధిక్‌కు గతంలో విన్నవించుకున్నారు. కొత్త భవనం నిర్మించాలంటే ఆలస్యం అవుతుంది కనుక లక్ష్మీ టాకీస్ ప్రాంతంలో ఉన్న భవనానికే మరమ్మతులు చేయించి ఇస్తానని ఆయన తెలిపారు. నగర మేయర్, ఇతర అధికారులతో చర్చించి మత్స్యకార సామాజిక భవనాన్ని నూతనంగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించారు. ఆయన కృషి ఫలించి మరమ్మతులకు రూ. 17.7 లక్షలు అధికారులు మంజూరు చేశారు. దీంతో పాత భవనం రూపురేఖలు మారిపోనున్నాయి. అల్యూమినియం తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు, శ్లాబ్, విద్యుత్ సౌకర్యం, వాటర్ ట్యాంక్, టైల్స్ వంటి అధునాతన హంగులతో సరికొత్తగా రూపుదిద్దేందుకు చర్యలు ప్రారంభించారు.

కల ఫలిస్తోంది..



మత్స్యకార భవనం కోసం ఎంతో కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. గత ప్రభుత్వంలో చేస్తాం.. చూస్తాం అంటూ కాలయాపన చేశారు కానీ ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లక్ష్మీ టాకీస్ ప్రాంతంలో ఉన్న సామాజిక భవనానికి మరమ్మతులు చేసి కొత్తగా మలిచి ఇస్తున్నారు. వైఎస్సార్‌సీపీతోనే మా కల సాకారం అవుతోంది.

–దూడ కృష్ణారావు, 39వ వార్డు

పాత నగరానికి పూర్వ వైభవం..



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పాత నగరం అభివృద్ధి చెందుతోంది. కేవలం నాలుగేళ్లలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఇప్పుడు మత్స్యకార సామాజిక భవనం కూడా అందుబాటులోకి రానుంది. సీఎం జగన్ ప్రభుత్వంతోనే పాతనగరం పూర్వ వైభవం సంతరించుకుంటుంది.

–మహ్మద్ సాధిక్, 39వ వార్డు కార్పొరేటర్

నాటక రంగం అభివృద్ధిలో గరికపాటి కృషి ఎనలేనిది



డాక్టర్ గరికపాటి రాజారావుకు నివాళులు అర్పిస్తున్న ప్రజానాట్య మండలి సభ్యులు

అల్లిపురం : ఆధునిక నాటక రంగం అభివృద్ధిలో డాక్టర్ గరికపాటి రాజారావు కృషి ఎనలేనిదని ప్రజా నాట్యమండలి ప్రతినిధి పి.కృష్ణన్న అన్నారు. అల్లిపురంలోని నీలం సంజీవరెడ్డి భవన్‌లో శుక్రవారం డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు చిరంజీవి, జి.కాసులరెడ్డి, బి.శివ తదితరులు పాల్గొని గరికపాటి రాజారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రంలో సాంస్కృతిక రంగాన్ని బలోపేతం చేయడంలో ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యవర్గ సభ్యుడు క్షేత్రపాల్, జిల్లా కార్యదర్శి ఎస్.అప్పారావు, దేవుడమ్మ, లక్ష్మణరావు, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై శ్రద్ధ అవసరం



బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్త



పాల్గొన్న నగరంలో గల వివిధ హాస్పిటళ్ల వైద్యులు, సిబ్బంది

డాబాగార్డెన్స్ : బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై ప్రతి ఆసుపత్రి శ్రద్ధ తీసుకుని జాగ్రత్తలు పాటించాలని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీరు నాగిరెడ్డి సూచించారు. బయో మెడికల్ వ్యర్థాలపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జీవీఎంసీ సంయుక్తంగా శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు పీజే శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలోని హాస్పిటల్స్ బయో మెడికల్ వ్యర్థాలు నిల్వ ఉంచకుండా, వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు పంపించి కాలుష్య నియంత్రణకు సహకరించాలన్నారు. డీఎల్ఎస్ఏ సివిల్ జడ్జి ఎం. వెంకటశేషమ్మ మాట్లాడుతూ బయో మెడికల్ వేస్ట్ ఎంత ప్రమాదమో ప్రతి ఒక్కరూ తెలుసుకుని, అవగాహన కలిగి ఉండడమే గాక జాగ్రత్తలు పాటించాలన్నారు. బయోమెడికల్ వేస్ట్‌ను ప్రతి ఆసుపత్రి బయో వేస్ట్ తీసుకెళ్లే వాహనానికి అందించి కాలుష్య నియంత్రణ మండలికి సహకరించాలన్నారు. సమావేశంలో నగరంలో గల వివిధ హాస్పిటల్స్ నుంచి వైద్యులు, మెడికల్ అండ్ హెల్త్ విభాగం అధికారులు, సిబ్బంది, జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



అచ్చియ్యమ్మపేటలో ఎమ్మెల్యే వాసుపల్లిని సత్కరిస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి తదితరులు



36వ వార్డు జామియా మసీదు వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ముస్లింల కోసం 36వ వార్డు జామియా మసీదు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. 39వ వార్డు కన్వేయర్ బెల్ట్ ప్రాంతంలో ఒకటిన్నర నెలల బాబు ఉయ్యాల నుంచి జారిపడి కోమాలోకి వెళ్లాడు. అతన్ని కిమ్స్ ఐకాన్‌లో చేర్పించి చికిత్స అందజేస్తున్నారు. ఇప్పటికే రూ. 4 లక్షలు ఖర్చు అయిందని, ఇంక డబ్బు ఖర్చు పెట్టే స్తోమత లేదని చెప్పటంతో కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి కేజీహెచ్‌లో బెడ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జీవీఎంసీ 29వ వార్డు ప్రెసిడెంట్ పీతల వాసు, మాజీ కార్పొరేటర్ బుద్దల అనురాధ, కోరుకొండ సూర్యప్రసాద్, బోణి దేవ తదితరులు పాల్గొన్నారు.

34వ వార్డులో..

అచ్చియ్యమ్మపేట, డాక్టర్ వై.ఎస్.ఆర్. విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారం నిమిత్తం అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, దూడ అప్పారావు, బాపు ఆనంద్, బొర్రా శ్రీనివాసరెడ్డి, వద్దాది దిలీప్, వాసుపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల కళాశాలలో ప్రథమ చికిత్స దినోత్సవం

డాబాగార్డెన్స్ : ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల శాఖ (సెట్విస్), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ బీవీఎస్ ప్రసాద్‌చే సీపీఆర్, స్నేక్‌బైట్, డాగ్ బైట్, కాలిన గాయాలకు ప్రథమ చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె. విజయ, రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది సంతోష్, గౌతమ్, కేవీఎస్ఎన్ మూర్తి, సెట్విస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న దేవదాయ శాఖ కమిషనర్



అమ్మవారికి పూజలు చేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

డాబాగార్డెన్స్ : దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ దంపతులు శుక్రవారం సిరులతల్లి కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. వారికి ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం వారిచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్య నిర్వాహక ఇంజినీర్ సీహెచ్‌వీ రమణ, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీ త్రివిక్రమ్ వర్మకు ఉత్కృష్ట సేవా పతకం

దొండపర్తి: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మకు ప్రతిష్టాత్మక ఉత్కృష్ట సేవా పతకం లభించింది. ఆయనతో పాటు జిల్లాలో ముగ్గురు సీఐలను, ఒక ఏఎస్ఐతో పాటు 14 మంది హెచ్‌సీలు, 14 మంది కానిస్టేబుళ్లను ఈ పతకానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. అలాగే అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఒక ఎస్ఐతో పాటు 16 మంది హెచ్‌సీలు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపికైన వారు..

దువ్వాడ సీఐలు బి.శ్రీనివాసరావు, ఎ.వెంకటలీలారావు, ద్వారకా సబ్‌డివిజన్ క్రైం టి.ఇమాన్యుయల్ రాజు, కంచరపాలెం ఏఎస్ఐ కె.కనకరాజు ఉత్కృష్ట సేవా పతకాన్ని అందుకోనున్నారు. అలాగే హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.జీవన్‌కుమార్(సీఏఆర్), జి.వి.రమణ(గోపాలపట్నం ట్రాఫిక్), ఎం.బాలరాజు(పీఎం పాలెం క్రైం), టి.వసంతరావు(సీఎస్‌బీ), జె.ఎం.ఎం.రెడ్డి(పద్మనాభం), జి.శ్రీనివాసరావు(త్రీటౌన్), ఎస్.శ్రీనివాసరావు(దువ్వాడ), డి.సురేష్‌కుమార్(దువ్వాడ క్రైం), ఎ.రమేష్‌కుమార్(దువ్వాడ ట్రాఫిక్), పి.జయసీలన్ (ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్), జి.శ్రీహరి(మల్కాపురం), కె.ప్రసాద్(మల్కాపురం), టి.కామేశ్వరరావు(ఆనందపురం క్రైం)తో పాటు ఏసీబీ హెచ్‌సీ టి.కొండలరావు ఈ సేవా పతకానికి ఎంపికయ్యారు. అదే విధంగా కానిస్టేబుళ్లు జి.ప్రసాద్(ఏఆర్), కె.ఎస్.స్వామి(ఏఆర్), జి.శ్రీనివాసరావు(ఏఆర్), వి.దశరావు(ఏఆర్), ఎం.గోవిందరావు(ఏఆర్), పి.సన్యాసిరావు(ఏఆర్), ఎస్.బి.వెంకటేశ్వర్లు(వన్‌టౌన్ క్రైం), ఇ.మునిరాజు(ఏఆర్), ఎస్.ఎరిబాబు (ఏఆర్), బి.శ్రీధర్(ఏఆర్), ఎం.వీరబాబు(ఏఆర్), కె.చిన్నయ్య(ఏఆర్), ఎం.ప్రసాదరావు(ఏఆర్), పి.చిన్న బొజ్జయ్య ఎంపికయ్యారు.

అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన వారు..

న్యూపోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ పి.రాజు, హెచ్‌సీలు కె.వైకుంటరావు (ఏఆర్), ఆర్.మాధవరావు(ఏఆర్), టి.రాము (ఆనందపురం ట్రాఫిక్), జె.వెంకటరవి(ఏఆర్), పి.వరహాలు(దువ్వాడ), ఎ.రమణారావు(సీసీఎస్), జి.శ్రీనివాసరావు(టూ టౌన్ ట్రాఫిక్), కె.బాబా అమర్ శేఖర్ (సీఎస్‌బీ), కె.ఈశ్వరరావు(గాజువాక క్రైం), వి.కనకరావు(ఏఆర్), ఎస్.కె.సుభాన్(సీఎస్‌బీ), జి.రామారావు(ఏఆర్), బి.ఎస్.మూర్తి(ఎంపీపీ)తో పాటు 16వ బెటాలియన్ హెచ్‌సీలు బి.రామానుజులు, పి.కోటేశ్వరరావు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌లో హెచ్‌సీ ఎం.సన్యాసిరావు ఈ పతకానికి ఎంపికయ్యారు.

వైఎస్సార్ బీమా అందజేత



లబ్ధిదారుకు బీమా సాయం అందజేస్తున్న తోట పద్మావతి

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డులో కుటుంబ పెద్ద దూరమైన కుటుంబాలకు వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి వైఎస్సార్ బీమా అందజేశారు. శుక్రవారం ఆమె ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందిన కొబ్బరితోట నివాసి పలివెల శ్రీను కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్ బీమా కింద అతని భార్య పలివెల యమునకు రూ.10 వేలు అందజేశారు. మిగిలిన మొత్తం త్వరలోనే అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా లివర్ సమస్యతో మృతి చెందిన కొల్లి ఈశ్వరరావు కుటుంబ సభ్యులకు బీమా తక్షణ సహాయంగా అతని భార్య కొల్లి లక్ష్మికి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, తాతబ్బాయి, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ఆర్.వెంకట రమణ, వలంటీర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రసాద్' పథకంతో సింహగిరికి మహర్దశ



ప్రసాద్ స్కీమ్ పనుల ప్రణాళికను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.55 కోట్ల ప్రసాద్ పథకం నిధులతో సింహగిరికి మహర్దశ పడుతుందని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ప్రసాద్ పథకం పనులకు సంబంధించి రూపొందించిన డీపీఆర్‌ను ఆయన శుక్రవారం సింహాచలం దేవస్థానంతో అధికారులతో కలిసి పరిశీలించారు. దేవదాయశాఖ, దేవస్థానం, టూరిజంశాఖ అధికారులతో పనులు జరిగే ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు పూర్తిస్థాయిలో వినియోగపడేలా అభివృద్ధి పనులు జరగాలని, అంతేకాని ఏ పనీ వృథాగా పోకూడదని సూచించారు. ఆలయ ఉత్తర ప్రాంగణంలో ఉన్న ప్రదేశంలో ఈశాన్యం మూలన యాగశాలను నిర్మించే విషయంపై వైదికుల సూచనలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. అలాగే ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న సువిశాల ప్రదేశంలో క్యూకాంప్లెక్స్ నిర్మాణంపై చేయాలా...వద్దా అన్న విషయంపై పరిశీలన జరిపారు. మాస్టర్‌ప్లాన్‌కు ఎలాంటి విఘాతం కలగకుండా పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. కొండదిగువ పురాతన పుష్కరిణి సత్రాన్ని తొలగించి ఆ స్థానంలో జీప్లస్–ఫైవ్ కింద ఆధునిక సదుపాయాలతో సత్రాలను నిర్మిస్తామన్నారు. పుష్కరిణి సత్రం మధ్యలో ప్రస్తుతం ఉన్న పురాతన మండపాన్ని అలేగే ఉంచుతామని తెలిపారు. 1936లో నిర్మించిన ఆగమ పాఠశాలను కూడా వేరే ప్రాంతంలో నిర్మిస్తామన్నారు.అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న భవనాన్ని ఆధునికీకరిస్తామన్నారు. ఈ సందర్భంగా వేద విద్యార్థులతో కొంతసేపు మాట్లాడారు. దేవస్థానం ఈవో కార్యాలయ భవనం కూడా పక్కాగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పాత అడవివరం వైపు నుంచి వచ్చే మార్గంలో ఉన్న రెండో టోల్‌గేట్ వద్ద సువిశాలమైన పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైన స్థలాన్ని పర్యాటకశాఖకు కేటాయిస్తామన్నారు. అలాగే సింహగిరిపై ఉన్న మ్యూజియాన్ని కమిషనర్ సందర్శించారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో త్రినాథరావు ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ సీఈ సీఏస్ఎన్ మూర్తి, ఈఈ రమేష్, జేఈలు మదన్‌మోహన్, సీతారామ్, దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఏడీసీ రామచంద్రమోహన్, డీసీ సుజాత, ట్రస్టుబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, దేవస్థానం అధికారులు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్



యూత్ ఫర్ సేవా సంస్థ అందించిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

సీతంపేట: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ సర్టిఫికెట్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు సిద్ధమవుతున్న మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సంస్థ ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేసింది. 8వ తరగతి చదువుతున్న 20 మందికి శుక్రవారం మెటీరియల్ అందించారు. డిసెంబర్‌లో పరీక్ష జరుగుతుందని, దీనిలో అర్హత సాధిస్తే 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఇస్తుందని పాఠశాల హెచ్‌ఎం శాంతి కుమారి తెలిపారు.

వర్షాభావ పరిస్థితుల్లోను నిరంతర విద్యుత్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

దొండపర్తి : వర్షాభావ పరిస్థితుల కారణంగా విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ ఆఫీస్ సమావేశ మందిరంలో హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి విశాఖలో అన్ని ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి పైగా వినియోగదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల కారణంగా అత్యధికంగా 1616 మెగావాట్ల విద్యుత్ వినియోగం రికార్డు అయినట్లు వివరించారు. విద్యుత్ లోటును సర్దుబాటు చేసేందుకు పరిశ్రమల విద్యుత్ వినియోగదారులకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో విద్యుత్ సరఫరా పరిస్థితి మెరుగుపడడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం ఎస్ఈజెడ్ నుంచి కొంత మంది హెచ్‌టీ వినియోగదారులు విద్యుత్ అంతరాయాలపై సందేహాలు వ్యక్తపరచగా వాటిని అధికారులు నివృత్తి చేశారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ మకుడి–సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో లైన్ సంబంధిత ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రయాణికుల మార్పులను గమనించి సహకరించాలని రైల్వే అధికారుల తెలిపారు. ఈ నెల 20 నుంచి 25 వరకు విశాఖలో బయల్దేరే విశాఖ–న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 20నుంచి 25వ తేదీ వరకు న్యూఢిల్లీలో బయల్దేరే న్యూఢిల్లీ– విశాఖ (20806)ఏపీ ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 14, 21వ తేదీల్లో బయల్దేరే విశాఖ–గాంధీదాం (20803) వీక్లీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 24న గాంధీదాంలో బయల్దేరే గాంధీదాం–విశాఖ (20804) వీక్లీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 22,25వ తేదీల్లో విశాఖలో బయల్దేరే విశాఖ–హజరత్ నిజాముద్దీన్ (12803)స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 20,24వ తేదీల్లో హజరత్ నిజాముద్దీన్‌లో బయల్దేరే హజరత్ నిజాముద్దీన్– విశాఖ (12804)స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 24న పూరిలో బయల్దేరే పూరి–ఓఖా (20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్, వార్ధా మీదుగా ప్రయాణిస్తుంది.

ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం



చేతివృత్తుల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాయల వెంకటరెడ్డి

ఆరిలోవ: దీన్‌దయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం ఆవరణలో సంఘమిత్ర సంస్థ ఆధ్వర్యంలో చేతివృత్తుల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బాలుర గృహాల్లో ఉండే బాలురకు చేతివృత్తుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవలు అందించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. సంస్థ నిర్వాహకుడు సూరిబాబు మాట్లాడుతూ ఇక్కడ జీవనోపాధి అందించే ఎలక్ట్రికల్, ప్లంబింగ్ తదితర చేతివృత్తుల్లో బాలురకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బి.సత్యనారాయణ, ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ, పలువురు బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.